ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ఆధునిక సాంకేతికతకు చిరునామాగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు

- అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం రేపు రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద జరుగుతుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

- భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసిలోకి పయనమయ్యారు.

- “సంవిధాన్ హత్య దివస్”ని ఈరోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నాం.

- రానున్న 24 గంటల్లో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ పురోగతిలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కీలకపాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో ఈ రోజు జరిగిన FICCI జాతీయ కార్యవర్గ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానంతో అనేక రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆధునిక సాంకేతికతకు చిరునామాగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. జీవితంలో సాంకేతికత ఒక భాగంగా మారుతోందని, డ్రోన్ల సహాయంతో రాత్రి సమయంలో పోలీసులు పాట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. ఏఐ పరిజ్ఞానంతో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని ముఖ్యమంత్రి వివరిస్తూ..

(వాయిస్ 36 సెకన్లు)

అలాగే ధనికులు, పేదల మధ్య అసమానతలు తొలిగించాలనే లక్ష్యంతో పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే మరిన్ని ప్రోత్సహకాలు ఉంటాయని పలు వాణిజ్య సంస్థలకు తెలియజేశారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఈ సంస్థలకు విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం రేపు రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద జరుగుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక

శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ రోజు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నర్సింహ కిషోర్ లతో కలిసి శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా వాసుల చిరకాల కోరిక అయినటువంటి అఖండ గోదావరి పర్యాటకం ప్రాజెక్టు సాకారం అవుతోందన్నారు. దాదాపు 94 కోట్ల రూపాయలతో తూర్పుగోదావరి జిల్లాలోని  రాజమహేంద్రవరం, కడియం, నిడదవోలు ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. కేంద్ర పర్యాటక - సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, స్థానిక ఎంపీ పురందేశ్వరిలతో కలిసి రేపు ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడిస్తూ ....

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసిలోకి పయనమయ్యారు. ఆయనతో కలిసి మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని యాక్సియం-4 మిషన్ నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్‌సెంటర్‌లో ఈరోజు మధ్యాహ్నం 12 గంటల 01 నిమిషానికి చేపట్టిన ఫాల్కన్ 9 రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి వెళ్లింది. కొద్ది క్షణాల తర్వాత రాకెట్ నుంచి వీరి క్యాప్సుల్ విడిపోయి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం దిశగా ప్రయాణం కొనసాగిస్తోంది.

ప్రస్తుతం ఈ వ్యోమనౌక భూకక్ష్యలోకి ప్రవేశించి అక్కడ ప్రయాణిస్తోంది. ఈ క్రమంలోనే అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా భారత పౌరులకు ఒక సందేశం

పంపారు. 41 సంవత్సరాల తర్వాత భారతీయుడు అంతరిక్షాన్ని చేరుకున్నాడని... ఇదో గొప్ప ప్రయాణమని ఆ సందేశంలో పేర్కొన్నారు. ఇప్పుడు తాము భూ కక్ష్యలో సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో తిరుగుతున్నామని తన భుజాలపై భారత త్రివర్ణ పతాకాన్ని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఇది కేవలం తన అంతరిక్ష ప్రయాణం మాత్రమే కాదని ఇది భారత మానవ సహిత రోదసి యాత్రకు నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

1975 జూన్ 25న దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన అప్పటి పరిస్థితులను గుర్తు చేసుకుంటూ... ఈరోజు "సంవిధాన్ హత్య దివస్"ని జరుపుకుంటున్నాం. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, అత్యవసర పరిస్థితి నుండి పాఠాల గురించి అవగాహన కల్పించడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా "లాంగ్ లివ్ డెమోక్రసీ యాత్ర"ను ఈరోజు న్యూ ఢిల్లీలో ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా జిల్లా రుద్రవరంలో ఉన్న కృష్ణ విశ్వ విద్యాలయం 2025 స్నాతకోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ స్నాతకోత్సవానికి మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, స్థానిక ఎంపీ వల్లభనేని బాలశౌరి కూడా హాజరయ్యారు. అంతకముందు యూనివర్సిటీ ప్రాంగణంలో కోటి 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన క్యాంటీన్, హాస్టల్ వసతి సముదాయాన్ని ప్రారంభించారు.

ఇక ఈ స్నాతకోత్సవంలో ప్రసంగించిన రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ దేశ అభివృద్ధికి కృషి చేసేలా యువత తమని తాము సంకల్పించుకోవాలని సూచిచారు.

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేసాన్ని నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ పార్టీ కి చెందిన శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రజలకు తెలియజేసేలా 'చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' పేరుతో 5 వారాల బృహత్తర కార్యక్రమానికి ఈ సమావేశంలో శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించి ఇంటింటికీ దాన్ని చేర్చేలా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం 50 వేల కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. నెల్లూరులో ఆమె ఈరోజు వివిధ శాఖల అధికారులతో సమావేశమైన అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో  వివిధ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే

రెండు నెలల్లో జిల్లాలో అర్హులైన గిరిజనులందరికీ రేషన్.. ఆధార్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అదనంగా 20 వన్ దన్ వికాస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి వుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇక రానున్న మూడు రోజులు ఉత్తర కోస్తాంధ్ర లో తేలికపాటి నుండి  ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =